సాక్షి
కుమురం భీం

శుక్రవారం ၊ 26 ၊ జూలై ၊ 2024



ఆగని వన్యప్రాణుల వేట
అభయారణ్యంలో వేటగాళ్ల ఉచ్చులకు మూగజీవాలు బలైపోతున్నాయి. భారీ స్థాయిలో చెట్లు నరకడం, వన్యప్రాణులను వేటాడడం సాధారణమైపోయింది. IIలో▸



గుప్పుమంటున్న గుడుంబా
జిల్లా వ్యాప్తంగా గుడుంబా గుప్పుమంటోంది. వాగులు, ఒర్రెల పరిసర ప్రాంతాల్లో గుడుంబా స్థావరాలు కుటీర పరిశ్రమలుగా కొనసాగుతున్నాయి. IIIలో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.6 /25.2
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

అరకొర నిధులు!



- రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజన జిల్లాకు తీవ్ర నిరాశ
- అత్తెసరు నిధుల కేటాయింపు
- సాగునీటి ప్రాజెక్టులకు అంతంతే..
- ఆరు గ్యారంటీలతో ప్రజలకు కాస్త ఊరట



ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న జగన్నాథపూర్ ప్రాజెక్ట్

సాక్షి, ఆసిఫాబాద్: కాంగ్రెస్ సర్కారు రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజన జిల్లాకు అరకొర నిధులు కేటాయించింది. డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న జిల్లా ప్రజలకు మళ్లీ నిరాశే ఎదురైంది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు ఈసారైనా భారీగా నిధులు కేటాయిస్తారని ఆశించిన రైతులకు ఆశాభంగం కలిగింది. అత్తెసరు నిధుల కేటాయింపుతో ఎలాంటి ఉపయోగం లేదని రైతు సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో అధిక ప్రాధ్యాతన ఇవ్వడం ద్వారా జిల్లా ప్రజలకు కొంత మేర లబ్ధి చేకూరే అవకాశం ఉంది. గిరిజన జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి పెద్దపీట వేయకపోవడం గమనార్హం.

'మహాలక్ష్మి'తో 70 వేల మందికి లబ్ధి

ఆకాశాన్నంటిన గ్యాస్ సిలిండర్ ధర నుంచి ఊరట కల్పించే 'మహాలక్ష్మి' పథకం జిల్లా ప్రజలకు కొంత ఊరటనిచ్చే అంశం. ఈ పథకం కింద రూ.500కే వంటగ్యాస్ సిలిండర్‌ను ఇస్తుండటంతో జిల్లాలో 70,298 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.723 కోట్లు కేటాయించడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే టీజీఆర్టీసీ నడిపే బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కూడా జిల్లాలోని మహిళలకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. జిల్లాలో రోజుకు సగటున 26వేల మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. ప్రతిరోజూ



కౌటాల మండలంలో ప్రాణహిత ప్రాజెక్టు శిలాఫలకం

వీరి ద్వారా ఆర్టీసీకి సుమారు రూ.10 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది.

67 వేల మందికి 'గృహజ్యోతి'

జిల్లాలో ఈ ఏడాది మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకం అమలవుతోంది. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్తును వినియోగించుకునే గృహాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఈ పథకం కింద జిల్లావ్యాప్తంగా 67వేల మందికి జీరో బిల్లులు జారీ అవుతున్నాయి.

గుంతల రోడ్లకు నిధులేవి..?

వెనుకబడిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అభివృద్ధికి బడ్జెట్‌లో భారీగానే కేటాయింపులు జరుగుతాయన్న జిల్లా ప్రజల ఆశలపై ఆర్థిక మంత్రి భట్టి నీళ్లు చల్లారు. తెలంగాణ రాష్ట్రంలో అన్నివిధాలుగా వెనుకబడి ఉన్న ఏజెన్సీ జిల్లా అయిన ఆసిఫాబాద్‌లో ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో అభివద్ధి జరగలేదు. అధికారుల ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు. ముఖ్యంగా జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ రోడ్లు గుంతలమయమవ్వగా.. జిల్లాలో 432 గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. ఇక ఏజెన్సీ గ్రామాలకు నేటికీ లింకు రోడ్లు లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. తాత్కాలిక మరమ్మతులతో అధికారులు మమ అనిపిస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు అరకొరే..

జిల్లాలో ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల పథకం, కుమురంభీం(అడ), జగన్నాథ్‌పూర్, పీపీరావు సాగర్, ఎన్టీఆర్ సాగర్ వంటి మధ్య తరహా ప్రాజెక్టులకు ఈసారీ అరకొరగానే నిధులు కేటాయించారు. దీంతో కాలువల నిర్వహణ, మరమ్మతులు, భూసేకరణ వంటి పనులు స్తంభించనున్నాయి. ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి రూ.248.99 కోట్లు కేటాయించారు. ముఖ్యంగా 60 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నిర్మించిన కుమురంభీం, జగన్నాథపూర్ ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి కావడానికి దాదాపు రూ.250 కోట్లు అవసరం అవుతాయని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. కానీ బడ్జెట్‌లో కుమురంభీం ప్రాజెక్టు కోసం రూ.7.95 కోట్లు.. జగన్నాథపూర్ ప్రాజెక్టుకు రూ.12.32 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇక వట్టివాగు ప్రాజెక్టుకు రూ.2.59 కోట్లు, ఎన్టీఆర్ సాగర్‌కు రూ.15.60 లక్షలు నిధులు మంజూరు చేశారు. పీపీరావు సాగర్ రూ.2.34 కోట్లు కేటాయించారు. అలాగే మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు వాగులు, వంకలపై 76 చోట్ల ప్రధాన వంతెనల నిర్మాణానికి అధికారులు పంపిన ప్రతిపాదనలకు ఒక్కపైసా కూడా మంజూరు కాలేదని తెలుస్తోంది.

ప్రజల బడ్జెట్ కాదు



ఆసిఫాబాద్: రాష్ట్ర అసెంబ్లీలో గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల బడ్జెట్ కాదు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు మొండి చేయి చూపించారు. కేటాయింపుల్లో గ్రామీణ రహదారుల అభివృద్ధి ఊసే లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన వివిధ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. పింఛన్ల పెంపుపై స్పష్టతనివ్వలేదు. ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడం దారుణం. బడ్జెట్ కేటాయింపుల్లో పారదర్శకత కొరవడింది.
– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

'ప్రాణహిత'కు నిధులు హర్షణీయం



కౌటాల: రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని దివంగత సీఎం వైఎస్సార్ కౌటాల మండలం తుమ్మిడిహెట్టిలో ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మరణాంతరం ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగలేదు. స్వరాష్ట్రంలోనూ దృష్టి సారించకపోవడంతో మరుగున పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షణీయం. పనులు పూర్తి చేసి పంటలకు సాగు నీరందించాలి.
– పెందోర్ కొండాజీ, రైతు, వీర్దండి, మం.కౌటాల

మహిళలకు మేలు



కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పేద మహిళలకు ఎంతో లాభం చేకూరుతోంది. నా కూతురు సిర్పూర్(టి)లోని హాస్టల్‌లో చదువుతోంది. పాపను చూడటానికి ప్రతినెలా ఆర్టీసీ బస్సులోనే వెళ్తున్నా. ఉచిత బస్సు ప్రయాణంతోపాటు ఇతర మహాలక్ష్మి పథకాలను నిరంతరం కొనసాగించాలి. జిల్లాలోని బస్టాండ్లను మెరుగుపర్చాలి.
– వందన, గురుడుపేట, మం.కౌటాల

నేడు మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్



భుజంగ్‌రావు, మున్సిపల్ కమిషనర్, ఆసిఫాబాద్

ఆసిఫాబాద్‌అర్బన్: వర్షాకాలం సీజనల్ వ్యాధుల కాలం. పారిశుధ్యం లోపించి కాలువల్లో మురుగు నీరు స్థిరంగా నిలిచి, రహదారుల పక్కన ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల పరిసరాల్లో వ్యర్థాలు పేరుకపోవడంతో దోమలు వృద్ధి చెందుతాయి. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి. ఈ క్రమంలో ఆసిఫాబాద్ పట్టణంలోని సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది. మున్సిపాలిటీ ప్రజలు తమ ప్రాంత సమస్యలపై కమిషనర్‌ను నేడు నేరుగా ఫోన్‌లో సంప్రదించవచ్చు.

అంశం:
పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

సమయం:
శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

85004 66105

డిగ్రీలో చేరేందుకు ప్రత్యేక అవకాశం

కాగజ్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించి ఇప్పటివరకు డిగ్రీలో చేరని విద్యార్థులకు ప్రభుత్వం మరోసారి ప్రత్యేక అవకాశం కల్పించిందని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 2 వరకు విద్యార్థులు దోస్త్ పోర్టల్‌లో నమోదు చేసుకుని డిగ్రీలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఆశ్రమాల్లో శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల్లో ఆహారం కలుషితం కాకుండా వంట చేసే సమయంలో సిబ్బంది శుభ్రత పాటించాలని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏటీడీవో కార్యాలయంలో కుక్‌లు, కామాటీలకు గురువారం నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొని సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఈగలు, దోమల ప్రభావంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు వంటశాల, పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాజా కూరగాయలతో రుచికరమైన వంటలు చేయాలని సూచించారు. విద్యార్థులను తమ పిల్లలుగా భావించి సేవ చేయాలని కోరారు. ఏసీఎంవో ఉద్ధవ్, జీసీ డీవో శకుంతల, డీఎస్‌వో మీనారెడ్డి, ఏటీడీవోలు క్షేత్రయ్య, కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల తనిఖీలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో గురువారం మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో జన్కాపూర్‌లోని దేవి స్వీట్ హౌజ్, బేకరీని తనిఖీ చేయగా.. కాలం చెల్లిన చిప్స్ ప్యాకెట్లు, బూజు పట్టిన స్వీట్లను గుర్తించారు. నాసిరకమైన ఆహారం, స్వీట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించి దుకాణం సీజ్ చేశారు. యజమానికి రూ.6 వేల జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ భుజంగరావు మాట్లాడుతూ దుకాణాల్లో కాలం చెల్లిన వస్తువులు, చెడిపోయిన ఆహార పదార్థాలు విక్రయిస్తే మున్సిపల్ చట్టం– 2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో జూనియర్ అసిస్టెంట్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ నిర్మూలించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, డీవైఎఫ్ఐ నాయకులు

ఆసిఫాబాద్: యువతను మత్తులో ముంచి వారి జీవితాలను చిత్తు చేసే గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన మాదక ద్రవ్యాల నిర్మూలన పోస్టర్‌ను గురువారం ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందన్నారు. వివిధ రంగాల్లో రాణించాలంటే మేథస్సు, నైపుణ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు మాలాశ్రీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టీకానంద్, దుర్గం దినకర్, శ్రావణి, నిఖిల్, శ్రీకాంత్, సతీశ్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో 'కార్గిల్ విజయ్ దివస్'



కాగడాలు ప్రదర్శిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో గురువారం రాత్రి కార్గిల్ విజయ్ దివస్‌గా ఘనంగా నిర్వహించారు. కార్గిల్ యుద్ధ వీరులను స్మరించుకుంటూ కాగడాలతో ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జాతీయ కోఆర్డినేటర్ అనుష్ యాదవ్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్లను స్మరించుకుంటూ దేశంలో ఏటా కార్గిల్ విజయ్ దివస్ జరుపుకొంటున్నామని తెలిపారు. అమరుల త్యాగాలను కొనియాడారు. మోదీ హయాంలో భద్రతా దళాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్‌కుమార్, నాయకులు బోనగిరి సతీశ్‌బాబు అరిగెల మల్లికార్జున్, మురళీధర్, ఇగురుపు సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సరైన సమయం



మొక్క నాటుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన ఎస్పీ శ్రీనివాసరావు, అధికారులు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఖైరిగూడ ఓసీపీలో ఘనంగా వన మహోత్సవం

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రస్తుతం జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు ఇదే సరైన సమయమని, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం గురువారం ఖైరిగూడ ఓసీపీలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి హాజరయ్యారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ జీవరాశి మనుగడకు చెట్లే ప్రాణాధారమని అన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 53లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించామని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో సింగరేణి పాత్ర ఎంతో కీలకమైందన్నారు. లక్షలాది మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడేందుకు ఎంతో కృషి చేస్తోందని పేర్కొన్నారు. సింగరేణి ప్రాంతాలు, కాలనీల్లో ఉండే పచ్చదనమే ఇందుకు నిదర్శనమన్నారు. ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ మాట్లాడుతూ.. గురువారం ఒక్కరోజే బెల్లంపల్లి ఏరియాలో 20వేల మొక్కలు నాటడంతో పాటు 5వేల మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంలో సింగరేణి ఆధ్వర్యంలో నాటిన మొక్కలు, వృక్షాలుగా ఎదిగిన వాటి వివరాలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం నరేందర్, ప్రాజెక్టు అధికారులు సత్యనారాయణ, ఉమాకాంత్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, సీఎంవోఏఐ అధ్యక్షుడు మధుసూదన్, డీవైపీఎం వేణు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు నిధులు కేటాయించకపోవడం విడ్డూరం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రంగారెడ్డి జిల్లాకు మాత్రమే ప్రాధాన్యత కల్పించారని, అన్నివిధాలుగా వెనుకబడిన ఆసిఫాబాద్ జిల్లాకు నిధులు కేటాయించకపోవడం విడ్డూరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2024– 25 రాష్ట్ర బడ్జెట్ ఆశాజనకంగా లేదన్నారు. జిల్లాలోని జలాశయాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టు మాటలకే పరిమితమైందని మండిపడ్డారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో చూపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యవసాయ నిధులపై స్పష్టత లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాను అభివృద్ధి పరంగా వెనక్కినెట్టిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాగే వ్యవహరిస్తుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు అరిగెల మల్లికార్జున్, కోట్నాక విజయ్, సెర్ల మురళి, ఖాండ్రె విశాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని ముసురు

ఆసిఫాబాద్: జిల్లాలో నాలుగు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేని వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో 28.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా కౌటాలలో 47.4 మిల్లీమీటర్లుగా రికార్డు అయ్యింది. అలాగే జైనూర్‌లో 30.2, సిర్పూర్–యు 26.2, లింగాపూర్ 33, తిర్యాణి 14.6, రెబ్బెన 13.4, ఆసిఫాబాద్ 30.0, కెరమెరి 27.2, వాంకిడి 36.4, కాగజ్‌నగర్ 13.2, సిర్పూర్–టి 42.4, చింతలమానెపల్లి 43.6, బెజ్జూర్ 21, పెంచికల్‌పేట్ 24.2, దహెగాంలో 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆసిఫాబాద్ మండలంలోని కుమురంభీం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 243 మీటర్లు కాగా గురువారం 237.8 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 3,650 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 3876 క్యూసెక్కులు ఉంది. ఎగువ నుంచి వరద రావడంతో ప్రాజెక్టు 5, 6 గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు.

ఉరుసుడు.. తడుసుడు



తరగతి గదులు తడవడంతో వరండాలోని కుర్చీల్లో కూర్చున్న విద్యార్థులు

కౌటాల(సిర్పూర్): మండలంలోని గురుడుపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల భవనం వర్షాలకు ఉరుస్తోంది. విద్యార్థులు గొడుగులు పట్టుకుని పాఠాలు వింటున్నారు. ఇక్కడ ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 85 మంది చదువుతున్నారు. వీరికి 15 ఏళ్ల క్రితం నిర్మించిన రెండు భవనాల్లో నాలుగు గదులు అందుబాటులో ఉన్నాయి. పైకప్పుకు పగుళ్లు వచ్చి వర్షాలకు ఉరుస్తుండటంతో మూడు గదులు తడిసిపోతున్నాయి. గొడుగులు పట్టుకుని పాఠాలు వింటున్నామని ఏడో తరగతి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే ఒకే తరగతి గదిలో 85 మందిని కూర్చోబెడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా రూ.లక్షకు పైగా నిధులు ఖర్చు చేసి విద్యుత్ సౌకర్యం, చిన్న మరమ్మతులు చేపట్టారు. అలాగే పాఠశాల భవనం చుట్టూ ఇళ్లు ఉండగా.. ఎదురుగా ఉన్న సీసీరోడ్డు భవనం కంటే ఎత్తులో ఉంది. వర్షం కురిసినప్పుడల్లా వరద బడి ఆవరణంలోకి చేరుతోంది. ఈ విషయంపై కౌటాల ఎంఈవో డి.సోమయ్యను వివరణ కోరగా.. గురుడుపేట పాఠశాల గదులు ఉరుస్తున్న విషయం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పైకప్పుకు మరమ్మతులు చేస్తామని తెలిపారు. ఆవరణలో వరదనీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



బడి ఆవరణలో నిలిచిన వరద

స్థానికత ఆధారంగా సొంత జిల్లాకు పంపించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): 317 జీవో ద్వారా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తుంగెడ, గంగాపూర్, నంబాలతోపాటు పలు పాఠశాలల్లో గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 317 ఉత్తర్వుల ద్వారా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల వివరాలను ఇప్పటికే విద్యాశాఖ సేకరించిందన్నారు. ఈ లెక్కల ప్రకారం జిల్లాకు దాదాపు 875 మంది ఇతర జిల్లాల నుంచి వచ్చినట్లు అధికారులు తేల్చారని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా వారిని స్థానికత ఆధారంగా సొంత జిల్లాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. నూతన నియామకాల కంటే ముందే ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల కరెంట్ బిల్లులు, బకాయిలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత కరెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజకమలాకర్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, బత్తుల సదానందం, హెచ్‌ఎంలు అబ్దుల్ లతీఫ్, పురుషోత్తం, వినయ్‌కుమార్, కేజీబీవీ ఎస్‌వో పద్మ, ఉపాధ్యాయులు లింగన్న, రాజేందర్, సంపత్‌కుమార్, సత్తయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సభ్యత్వం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఆగని వన్యప్రాణుల వేట

- విద్యుత్ ఉచ్చులతో హతమారుస్తున్న వైనం..
- కంచె తొలగిస్తుండగా ఇటీవల ఓ వేటగాడికీ షాక్
- 'మామూలు'గా తీసుకున్న అటవీశాఖ అధికారులు


గతేడాది మార్చిలో వేటగాళ్ల చేతిలో బలైన పులి ఎముకలను స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో ప్రకృతి అందాలకు నిలయంగా ఉన్న కవ్వాల్ ఒకవైపు అటవీప్రాంతం, మరోవైపు మహారాష్ట్ర తడోబా పులుల అభయారణ్యం కలుపుకుని ఉంటుంది. ప్రాణహిత సరిహద్దులను దాటి పులులు జిల్లా అటవీ ప్రాంతంలోకి చేరుకుంటున్నాయి. కోటపల్లి, నీల్వాయి, కవ్వాల్ లాంటి అభయారణ్యంలో వేటగాళ్ల ఉచ్చులకు మూగజీవాలు బలైపోతున్నాయి. అభయారణ్యంలో ఒకప్పుడు కుందేళ్లు, పులులు, జింకలు, చిరుతలు, దుప్పులు ఎలుగుబంట్లు, నీలుగాయిలు, అడవిదున్నలు, అడవిపందులు అధికసంఖ్యలో ఉండేవి. అడవుల అభివృద్ధికి ప్రభుత్వం హరితహారం, వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటుతుంటే మరోవైపు స్మగ్లర్లు వనమేధం చేయడం, వన్యప్రాణులను వేటాడడం జిల్లాలో సర్వసాధారణమైపోయింది. అటవీశాఖ అధికారుల కనుసన్నల్లోనే కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేట సాగుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

ఆవు, ఎద్దు మాంసం పేరిట విక్రయాలు?

2023 మార్చిలో ఉట్నూర్‌కు చెందిన ఓ మాంసం వ్యాపారి ఆవు, ఎద్దు మాంసం పేరట అటవీ జంతువుల మాంసాన్ని లక్సెట్టిపేటకు కారులో తరలిస్తుండగా ఓ అటవీ శాఖ అధికారి పట్టుకున్నాడు. బీఆర్ఎస్‌కు చెందిన ఓ నాయకుడు జోక్యం చేసుకుని అధికారికి ముడుపులు ముట్టజెప్పడంతో విషయం సద్దుమణిగింది. సదరు వ్యాపారి అటవి జంతువులను వేటాడి ఆవు, ఎద్దు మాంసం పేరుతో రహస్యంగా ముందుగానే బుక్ చేసుకున్న వారికి కిలోకు రూ.500ల నుంచి రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. జన్నారం, ఉట్నూర్, కోటపల్లి, నీల్వాయి. ర్యాలీగడ్‌పూర్, శివ్వారం, లింగన్నపేట, యెర్రాయిపేట, తిర్యాణి అటవీ ప్రాంతాల్లో కొందరు వేటగాళ్లు జంతువులను హతమార్చడం వృత్తిగా మార్చుకుని వేట మాంసాన్ని మంచిర్యాల, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూర్, తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం. అటవీ జంతువులను హతమార్చిన కేసుల్లో ఎవరికీ పెద్దగా శిక్ష పడిన దాఖలాలు లేకపోవడంతో అధికారుల అండతోనే దందా సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో అటవీశాఖ అధికారులు తమ ఉనికిని చాటుకునేందుకు అడపాదడపా కేసులు నమోదు చేస్తూ అక్కడక్కడ చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి.

మచ్చుకు కొన్ని ఘటనలు..

- బెల్లంపల్లి మండలం రంగంపేటకు చెందిన బాలచందర్, బోర్లకుంట లక్ష్మయ్య, కొడగండ్ల అంజీ ఐదేళ్ల క్రితం పులిని హంటింగ్‌తో చంపి పాతిపెట్టారు. 2023 మార్చి 25న విషయం బయటకు పొక్కడంతో అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారి వద్ద నుంచి పులి ఎముకలు, గోర్లు స్వాధీనం చేసుకున్నారు.
- గతంలో మందమర్రి మండలం పులిమడుగులో వన్యప్రాణులు (అలుగులు) వేటాడి విక్రయిస్తున్న ఓ ముఠాను అటవీశాఖ అధికారులు పట్టుకుని 20 మందిపై కేసు నమోదు చేశారు.
- జన్నారం అటవీ డివిజన్ పరిధి తాళ్లపేట్ రేంజ్‌లోని రాజుగూడ శివారులో ఓ సాంబారును వేటగాళ్లు హతమార్చిన ఘటన వెలుగులోకి వచ్చింది.

కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేటను అరికట్టడంలో అధికారులు విఫలం...

వన్యప్రాణుల వేట, కలప అక్రమ రవాణా అరికట్టడంతో అటవీశాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు కొందరు అటవీశాఖలో పనిచేసే అధికారులే కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. కోటపల్లి రేంజ్, అల్గామ ప్రాణహిత నదిలో స్వాధీనం చేసుకున్న కలప కేసులో అధికారులు చేతివాటం ప్రదర్శించిన తీరు, పార్‌పెల్లి అటవీ ప్రాంతంలో హంటింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోకపోవడం తీరును చూస్తుంటే అధికారులు 'మాములుగా' తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేటకు వెళ్లి ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు...!


విద్యుత్ తీగలకు తగిలి గాయపడిన రాజబాబు

కోటపల్లి రేంజ్, పారిపెల్లి బీట్ పరిధిలోని బ్రహ్మదేవునిగుట్ట నుంచి చింతలపల్లి వరకు అటవీప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు ఎర్రాయిపేట గ్రామానికి చెందిన మెట్టుపల్లి రాజబాబుతో పాటు మరో నలుగురు వేటగాళ్లు విద్యుత్ తీగలతో ఉచ్చు బిగించారు. వీటికి 33 కేవీ విద్యుత్ మెయిన్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేలా చేశారు. ఈ ఉచ్చుకు రెండు అడవి పందులు సైతం పడ్డట్లు సమాచారం. పందులను స్వాధీనం చేసుకున్న అనంతరం రాజబాబు 33 కేవీ లైన్‌కు తగిలేసిన వైర్లను తొలగించేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో గాయాలపాలయ్యాడు. అతన్ని అక్కడే వదిలేసి మిగతా నలుగురు ఉచ్చుకు పడిన పందులను తీసుకెళ్లి లింగంపల్లిలో విక్రయించినట్లు సమాచారం. ఈ ఘటనను స్థానిక ఓ గల్లీ లీడర్ పోలీసులు, అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఘటన స్థలానికి వెళ్లి విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కానీ విద్యుత్ ఉచ్చుకు కారణమైన వారిపై ఎలాంటి విచారణ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నిందితులు పరారీలో ఉన్నారు

కోటపెల్లి రేంజ్ పార్‌పెల్లి బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం విద్యుత్ వైర్లను అమర్చిన వారిపై ఐదురోజుల క్రితం కేసు నమోదైంది. నిందితులు పరారీలో ఉన్నారు. వారి కోసం గాలిస్తున్నాం. విద్యుత్ వైర్లకు తాకి గాయపడిన వ్యక్తి అటుగా ఎందుకు వెళ్లాడు? వేటగాళ్లతో వెళ్లాడా? లేదా ఏదైనా పనిమీద వెళ్తే ప్రమాదానికి గురయ్యాడా? అనేది విచారణ చేస్తున్నాం.

– రమేశ్, ఎఫ్‌డీవో, చెన్నూర్

క్లుప్తంగా

కలప స్వాధీనం

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ కిష్టాపూర్ పరిధిలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలోని కులువ కాయల మల్లేశ్ ఇంట్లో దాడులు నిర్వహించగా సైజులు, చెక్కలు మొత్తం కలిసి 0.0981 సీఎంటీ టేకు కలప పట్టుకున్నట్లు తెలిపారు. కలప విలువ రూ.8,463 ఉంటుందని, నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి మమత, సెక్షన్ అధికారులు కిరణ్మై జ్యోతి, ప్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య


అశ్విని (ఫైల్)

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన పోరేత్ అశ్విని (23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎన్.మధుకర్ తెలిపారు. అశ్విని కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుందని, మందులు వాడినా తగ్గలేదన్నారు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


లక్ష్మణ్(ఫైల్)

కాసిపేట: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన పెంజర్ల లక్ష్మణ్ (33) గురువారం ఉదయం సోమగూడెం నుంచి కాసిపేట వైపుకు స్కూటీపై వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి బాపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డప్పు కొడుతూ వ్యక్తి మృతి

కాసిపేట: మండల కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాడపాక బాపు (55) గురువారం దహన సంస్కారాల్లో డప్పు కొడుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ముత్యంపల్లికి చెందిన వేల్పుల అంకులు అనే సింగరేణి కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందగా మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. డప్పు వాయించేందుకు వెళ్లిన బాపు కొద్దిదూరం వెళ్లగానే తలనొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే బైక్‌పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు. మృతునికి భార్య శంకరమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుండెపోటుతో మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట: మండలంలోని లంబాడితండాలో మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో హత్య వివరాలను వెల్లడించారు. లంబాడితండా(డీ)కు చెందిన అజ్మీర నీల భర్త చనిపోవడంతో పదిహేనేళ్లుగా పల్లంగూడకు చెందిన గాండ్ల రవితో సహజీవనం చేస్తోంది. రవి స్నేహితుడు గోండుగూడకు చెందిన అంబారావు సదరు మహిళను కొన్ని రోజులుగా తన కోరిక తీర్చమని వెంటపడ్డాడు. అందుకు నిరాకరించడంతో ఈ నెల 24న గొంతుపిసికి హత్య చేసినట్లు పేర్కొన్నారు.

బోగస్ ఐటీ క్లెయిమ్స్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారి

మందమర్రిరూరల్: బోగస్ ఐటీ క్లెయిమ్స్‌పై ఇన్‌కంట్యాక్స్ అధికారి సూర్యభగవాన్, ఆఫీస్ సూపరింటిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఏరియాలోని సంక్షేమాధికారులకు అవగాహన కల్పించారు. ఉద్యోగుల బోగస్ ఇన్‌కంట్యాక్స్ క్లెయిమ్స్ గుర్తించడం, వాటిని నివారించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏరియా పర్సనల్ ఆఫీసర్ సల్ల శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీవైపీఎం ఆసిఫ్, ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్ల సంక్షేమాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న అడిషనల్ కలెక్టర్

శ్రీరాంపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్ అన్నారు. గురువారం ఆర్కే 5 గనిపై మొక్కలు నాటారు. కేంద్ర ప్రభుత్వ వృక్షరోపన్ అభియాన్-2024లో భాగంగా కేంద్రం బొగ్గు గనుల మంత్రి కిషన్‌రెడ్డి ధన్‌బాద్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి అన్ని గనులపై చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇటూ రాష్ట్ర ప్రభుత్వం 75వ వనమహోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా చేపట్టింది. ఈ కార్యక్రమాలను పురస్కరించుకొని కంపెనీ అధికారులు ఇక్కడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు మనమిచ్చే ఆస్తి చక్కటి పర్యావరణమేనన్నారు. జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ సింగరేణి లక్షలాది ఎకరాల్లో ప్లాంటేషన్ చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు కనీసం రెండు మొక్కలు నాటి అవి పెరిగే వరకు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి, రాముడు, ఓసీపీ పీవో టీ శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా ఇంజనీర్ యాదయ్య, గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, రక్షణాధికారి శివయ్య, ఏరియా డెప్యూటీ సీఎంవో రమేశ్‌బాబు, ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లతో సొంత యూనిట్లు


ప్రశ్నపత్రాలు అందిస్తున్న రాధాకుమారి

శ్రీరాంపూర్: వృత్తి శిక్షణ కోర్సుల్లో సర్టిఫికెట్లు కలిగి ఉంటే సొంత యూనిట్లు పెట్టుకోవచ్చని శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి మహిళల కోసం టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్ వంటి పలు వృత్తి కోర్సులను ఉచితంగా నేర్పించింది. ఇందులో నేర్చుకున్న 477 మందికి గురువారం ఆ కోర్సులకు సంబంధించిన ఖాదీ గ్రామోద్యోగ్ వారి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్, నస్పూర్ కాలనీలోని సేవాభవన్‌లలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు మహిళలకు పరీక్ష పత్రాలను అందించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైతే సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. మహిళలు సొంత యూనిట్లు పెట్టుకుని ఆర్థికంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు రీజియన్ అధికారి అనసూయ, సింగరేణి సీనియర్ పీవో కాంతారావు, సేవా సమితి కోఆర్డినేటర్ డీ.శివకుమార్, సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి


వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న జీఎం, అధికారులు

కాసిపేట: ప్రతిఒక్కరూ మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకుని పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. గురువారం ఏరియాలోని కేకేఓసీ ప్రాంతమైన పెద్దనపల్లి శివారు వాగు ప్రాంతంలో వృక్షారోపన్ కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎఫ్‌డీవో విజయ్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ రాళ్లవాగు లీజ్ హోల్డ్ ఏరియాలో సుమారు మూడు హెక్టార్లలో 300ల మొక్కలు నాటినట్లు తెలిపారు. వనమహోత్సవం 2024 కార్యక్రమం తిలకించడానికి లైవ్ స్క్రీన్‌లను మొక్కలు నాటే ప్రదేశంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏరియాలో సుమారు 53 హెక్టర్లలో 2లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా యాజమాన్యం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి సుభాష్, కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్, ఏరియా రక్షణాధికారి రవీందర్, సర్వేఅధికారి ఉజ్వల్ బందోపాధ్యాయ, ఏజీఎం ఈఅండ్ఎం నాగారాజు, డీజీఎం ఐఈడీ రాజన్న, కేకేఓసీ పీవో రమేశ్‌కుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ సూర్యనారాయణరాజు, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సింగరేణి ఫారెస్టు అధికారి రమణారెడ్డి, ఎన్విరాల్‌మెంట్ అధికారి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి


రైతువేదికలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 18 నుంచి 59ఏళ్ల వయస్సు గల ప్రతీ రైతు రైతుబీమా పథకాన్నిసద్వినియోగం చేసుకోవాలని, ఆగస్టు 8లోగా జిల్లా వ్యాప్తంగా రైతువేదికల్లో అందుబాటులో ఉండే వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈఓ) వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన తెలిపారు. గురువారం హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికను సందర్శించి రికార్డులు పరిశీలించారు. రైతుబీమా, రుణమాఫీలపై ఆరా తీశారు. అనంతరం కల్పన మాట్లాడుతూ రైతుబీమా కోసం దరఖాస్తుతోపాటు రైతుపట్టా పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను అందజేయాలని తెలిపారు. పంట రుణమాఫీ సమాచారం కోసం రైతులు తమ ఆధార్ కార్డు నంబర్‌తో ఆన్‌లైన్‌లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్నా రైతువేదికలో ఏఈఓలు నివృత్తి చేస్తారని తెలిపారు.

పుట్టిన రోజున మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న జీఎం శ్రీనివాసులు

జైపూర్: ప్రతిఒక్కరూ తమ పుట్టినరోజున విధిగా మొక్కలు నాటాలని ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో వృక్షారోపన్ అభియాన్, వన మహోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఐటీఎస్ఆర్ శరవణన్, కమాండెంట్ యోగేశ్ పర్మార్, అధికారులు సముద్రాల శ్రీనివాస్, ప్రసాద్, సుధాకర్, మదన్‌మోహన్, అఖిల్‌కపూర్, వాసుదేవమూర్తి, చంద్రమణి, రామశాస్త్రి, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి పర్శయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం, పటిక పట్టివేత


పట్టుకున్న బెల్లం, పటికతో అధికారులు

జన్నారం: మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాల్లో గురువారం లక్సెట్టిపేట సర్కిల్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి బెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని నరేశ్ దుకాణంలో 265 కిలోల బెల్లం, 5 కిలోల పటిక, బండారు లక్ష్మీనారాయణ కిరాణంలో 20 కిలోల బెల్లం, 25 కిలోల పటిక, చింతగూడలోని బాదావత్ తుకారాం దుకాణంలో 100 కిలోల బెల్లం, పొనకల్‌కు చెందిన వట్టెం కిష్టయ్య వద్ద 6 లీటర్ల నాటుసారా, గాజుల స్వామి వద్ద 2 లీటర్ల నాటుసారా, రేండ్లగూడకు చెందిన బాదవత్ గురువయ్య వద్ద 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పీ నర్సింహులు తెలిపారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, ఎస్సై ఇస్పతిరావు, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, సాగర్, వెంకటేశ్, సుజాత, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ప్రాణహిత


సుంపుటం అట్టలొర్రె వంతెన రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న ప్రాణహిత

వేమనపల్లి: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కుమురం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడం, పెన్‌గంగ, వార్ధా నదుల నుంచి వరద వస్తుండడంతో గురువారం వరద తీవ్రత ఎక్కువై ఉగ్రరూపం దాల్చింది. పుష్కరఘాట్ వద్ద రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. రాచర్ల–ముల్కలపేట మధ్య హైలెవల్ వంతెన పై నుంచి వరద ప్రవహిస్తుండటంతో అప్రోచ్‌రోడ్డు కృంగిపోయి 8 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. సుంపుటం, అట్టలొర్రె వంతెనతో పాటు జాజులపేట అంకన్న ఒర్రెవంతెన రోడ్డు మునిగిపోయాయి. ముక్కిడిగూడం ముత్యాలమ్మ గుడి వద్ద రోడ్డుపై నుంచి వరద పోటెత్తింది. ఈ మార్గంలో కల్లంపల్లితో పాటు కొమురంభీం జిల్లా దహెగాం, బెజ్జూర్ మండలాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో నాటుపడవల సాయంతో దాటుతున్నారు. లోతట్టు గ్రామాల్లో సుమారు 2,500 ఎకరాల్లో పత్తిపంట నీట మునిగింది. ప్రాణహిత వరద గంట గంటకు పెరుగుతుండటంతో ఎస్సై శ్యాంపటేల్ ప్రయాణికులను అప్రమత్తం చేశారు.

'అధికారుల భజనలో ఏఐటీయూసీ'


కార్మికులతో మాట్లాడుతున్న భూమయ్య

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గని కార్మికుల సమస్యలను గాలికి వదిలేసి ఏఐటీయూసీ నాయకత్వం అధికారుల భజనలో ఉందని ఐఎన్టీయూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య విమర్శించారు. గురువారం గనిపై ఐఎన్టీయూసీ బావి బాట కార్యక్రమంలో భాగంగా గని కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాన్‌రైడింగ్ నడిపే సమయాల మార్పుపై గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఇంత వరకు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 9 గంటల వరకు శ్రమదానం పేరిట పనులు చేయించి అండర్‌గ్రౌండ్‌లో పనికి వెళ్లాలంటే సమయం అయిపోయిందంటూ ఆపివేయడంతో కార్మికులు నడుచుకుంటూ పని స్థలాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇంత జరుగుతునా గెలిచిన ఏఐటీయూసీ నాయకులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. స్థానిక అధికారులతో కుమ్మక్కై కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కనీస వసతులు సైతం కరువయ్యాయన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, బత్తుల వేణు, బాపు, కన్నయ్య, గొర్ల శ్రీనివాస్, ఎర్రవెల్లి శంకర్, రాజేష్, దినేష్, శ్రీనివాస్ , రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

మందమర్రిరూరల్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1984–85 బ్యాచ్‌లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు గురువారం రామకృష్ణాపూర్ రోడ్డు పక్కన గల శ్రీమంజునాథ గార్డెన్‌లో బుధవారం రాత్రి కలుసుకున్నారు. 39 సంవత్సరాల తర్వాత మిత్రులంతా ఒకేచోట కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ జెడ్పీ చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరయ్యారు. వెల్ఫేర్ సొసైటీ ద్వారా సేకరించిన రూ. 20 వేల చెక్కును పూర్వవిద్యార్థి కేఎల్ఆర్ కృష్ణకు అందించారు.


1984–85 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు